


## మహానందీశ్వరుడి ఆదాయం రూ.2.21 కోట్లు

మహానంది, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానానికి కార్తీక మాసం పురస్కరించుకొని వివిధ సేవల ద్వారా రూ.2,21,23,830 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు క్షేత్రంలో జరిగిన కార్తీక మాసోత్సవాల్లో భాగంగా లక్షలాది మంది భక్తులు దైవదర్శనానికి వచ్చారని చెప్పారు. గత ఏడాది కార్తీక మాసం సందర్భంగా రూ.1,73,39,091 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.47,84,739 అధికంగా వచ్చిందని తెలిపారు.

# 220 మంది విద్యార్థులు ఒక్కరే ఉపాధ్యాయుడు

- ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె ప్రభావం
- గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రశ్నార్థకంగా మారిన విద్య
- 17 రోజులుగా పది విద్యార్థుల అవస్థలు
- ప్రభుత్వం స్పందించాలని తల్లిదండ్రుల వినతి

పాణ్యం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఎనిమిది గిరిజన గురుకుల ఉన్నత పాఠశాలలు ఉండగా రెండు జూనియర్ కళాశాలలు, ఒక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాల, ఒక మినీ గురుకుల పాఠశాల ఉన్నాయి. వీటిలో దాదాపు రెండు వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లోని దాదాపు 60 మంది ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు గత నెల 14వ తేదీన సమ్మెలోకి వెళ్లడంతో విద్యార్థుల బోధనకు ఆటంకమేర్పడింది. దీంతో చేసేదేమీలేక ఉన్న ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే చదువు చెప్పాల్సి వస్తోంది. పాణ్యంలోని బాలుర గురుకుల పాఠశాలలో 208 మంది విద్యార్థులు ఉండగా ఉన్న ఏడుగురు సమ్మెలోకి వెళ్లారు. దీంతో ప్రిన్సిపాల్, ఆర్ట్ టీచర్ చదువు చెబుతున్నారు. ఆలూరులోని గురుకుల పాఠశాలలో 290 మంది విద్యార్థులు ఉండగా ఎనిమిది మంది సమ్మెలోకి వెళ్లారు. ఉన్న ఒక్కరే చదువు చెప్పాల్సి వస్తోంది. ఆళ్లగడ్డలో నలుగురు సమ్మెలోకి వెళ్లారు. ఉమ్మడి జిల్లాలో అన్ని పాఠశాలల పరిస్థితి ఇదే. ఏర్పాటు చేయకపోవడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పాణ్యం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల

### ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేర్చాలి

ప్రభుత్వం మా డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి. మెగా డీఎస్సీ నుంచి రాష్ట్రంలోని 1143 మంది ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను మినహాయించాలి. 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు పెంచాలి. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించాలి. సమ్మెతో విద్యార్థులు తమ విలువైన చదువు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితికి మంత్రే బాధ్యత వహించాల్సి ఉంటుంది. డిమాండ్ల పరిష్కార చర్యలకు ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించడం విచారకరం.

- లక్ష్మానాయక్, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల ఔట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్

పాణ్యంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మూడు నుంచి 10వ తరగతి వరకు 220 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంతమందికి కలిపి ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరందరూ ఔట్ సోర్సింగ్ కింద విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 14వ తేదీన తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెలోకి వెళ్లారు. దీంతో పాఠశాలలో ప్రిన్సిపాల్‌తోపాటు ఆర్ట్ టీచర్ మాత్రమే మిగిలారు. గత 17 రోజులుగా ప్రిన్సిపాలే ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పదో తరగతి విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది. వచ్చే పరీక్షల్లో దీని ప్రభావం ఉంటుందన్న తల్లిదండ్రుల ఆలోచనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం లేదని విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు.

### ఆశ్రమ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు

సమ్మెలోకి వెళ్లిన ఉపాధ్యాయుల స్థానంలో ఉభయ గోదావరి జిల్లాల ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైనట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కాగా వీరు ఇతర జిల్లాల నుంచి వచ్చి చదువు చెప్పే పరిస్థితి సఫలమవుతుందా అన్నది ప్రశ్న. గతంలో ఇదే పరిస్థితి ఏర్పడితే ఇతర జిల్లాల నుంచి ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడంతో స్థానిక పరిస్థితులతో ఇతర జిల్లాల్లో విధులు నిర్వహించడానికి ఉపాధ్యాయులు విముఖత వ్యక్తం చేశారని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. కాగా ఈ నెల 2వ తేదీన ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం సోమవారం నాటికి

### రెండు రోజుల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు

రెండు రోజుల్లో సర్దుబాటు చేస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తూర్పుగోదావరి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు పశ్చిమ గోదావరి జిల్లాల గురుకుల ఆశ్రమ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. 789 మంది ఉపాధ్యాయులకు 550 మంది ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది. రెండు రోజుల్లో ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకుంటారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

-వెంకట శివప్రసాద్, ఐటీడీఏ పీవో, శ్రీశైలం

# వరిపై తుఫాన్ ప్రభావం



రుద్రవరం మండలం వెలగలపల్లె సమీపంలో తడిసిన వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న అన్నదాతలు

- పంట నేలవాలి రాలిపోతున్న గింజలు
- తడిసిన ధాన్యం

నంద్యాల జిల్లాలో పెంగల్ తుఫాన్ ప్రభావంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు నేలవాలి గింజలు రాలిపోతున్నాయి. వరిధాన్యం తడిసిపోయింది. దీంతో పంటలను, ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టార్పాలిన్ పట్టలను కప్పి ఉంచారు. అయినా తుఫాన్ ప్రభావంతో ధాన్యం దెబ్బతింటుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వరికోతలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తుఫాన్ అలజడికి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్




ఉయ్యాలవాడ: రూపనగుడిలో నేలవాలిన వరి పంట



చాగలమర్రి: చింతలచెరువులో వరి ధాన్యంపై కప్పిన పట్టలపై నిలిచిన వర్షపు నీరు



శిరివెళ్ల: వెంకటాపురంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు







ఆలూరు పట్టణం కోయా నగరంలోకి ప్రజాపంపిణీ దుకాణం వద్ద ఆదివారం రాయితీ బియ్యం కోసం క్యూకట్టిన కార్డుదారులు

# కాయితాల మీదే ఇంటింటికి బియ్యం

ఆలూరు/కర్నూలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణం కోయా నగరంలో పౌర సరఫరా దుకాణం-31 వద్ద ఆదివారం ప్రభుత్వం ఇస్తున్న రాయితీ బియ్యం కోసం కార్డుదారులు క్యూ కట్టారు. ఇంటింటికి వెళ్లి పేదలకు బియ్యం పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాలు ఉన్నాయి కదా..? ఆ వాహనాల ఆపరేటర్లకు నెలకు రూ.26,500 జీతాలు ఇస్తున్నారు. అయినా ప్రజా పంపిణీ దుకాణాలకు బియ్యం కోసం కార్డుదారులు ఎందుకు వస్తున్నారు..? విచారిస్తే విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. ఏడాది కాలంగా ఎండీయూ వాహనాలు రోడ్డెక్కలేదు. అయినా.. నెలనెలా ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేసి ఆపరేటర్లకు రెవిన్యూ అధికారులు జీతాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఆలూరులో ఒక్కటే కాదు.. జిల్లాలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి.

- రోడ్డెక్కని ఎండీయూ వాహనాలు
- ఆపరేటర్లకు జీతాలు చెల్లిస్తున్న రెవెన్యూ అధికారులు
- ఆలూరులో ఏడాదిగా సాగుతున్న భాగోతం
- బియ్యం అక్రమ రవాణా చేస్తున్న పలువురు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు
- కిలో రూ.10కు కొనుగోలు చేస్తున్న వైనం

జిల్లాలో ఏపీ ప్రభుత్వ ప్రజా పంపిణీ (సివిల్ సప్లయ్) విభాగం పర్యవేక్షణలో 1,233 నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలు ఉన్నాయి. 6.72 లక్షల రేషన్ కార్డుదారులకు ప్రతి నెల 9-10 వేల మెట్రిక్ టన్నుల రాయితీ బియ్యం సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్కరికి 5 కిలోలు చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికి ఇస్తున్నారు. పౌర సరఫరాల విభాగం నిత్యావసర సరుకుల దుకాణాలు ద్వారా బియ్యం, పప్పు, వంటనూనె.. వంటి రాయితీ సరుకులు ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి సరఫరా చేయాలనే లక్ష్యంగా ఎండీయూ వాహనాలను తీసుకొచ్చారు. జిల్లాలో 409 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్న వాహనాల ఆపరేటర్లు, హెల్పర్ ఇద్దరికి నెలకు రూ.26,500 చెల్లిస్తున్నది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పేదలకు ఇంటికే నిత్యావసర సరుకులు అందుతాయనే లక్ష్యంగా ఈ వాహనాలు కొనసాగిస్తున్నారు. మెజార్టీ వాహన ఆపరేటర్లు వైసీపీ మద్దతుదారులు అని సమాచారం. డిసెంబరు కోటా రాయితీ బియ్యం పంపిణీ ఆదివారం మొదలైంది. ఎండీయూ వాహనాలు ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నారా..? ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆసక్తి విషయాలు వెలుగు చూస్తున్నాయి. పలు మండలాల్లో వాహనాలు రోడ్డెక్కకపోయినా రికార్డుల్లో మాత్రం బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చూపించి ఆపరేటర్లకు జీతాలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు నగరంలో వాహన ఆపరేటర్లు కొందరు బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు వెలుగు చూస్తుంది.





ఆలూరు పట్టణం ఉపాధ్యాయ నగరంలో ఆపరేటర్ ఇంటి ముందు ఆపేసిన ఎండీయూ వాహనాలు. దుమ్ముధూళితో నిండిపోయాయి. టీడీపీ ప్రభుత్వం రాక ముందు నుంచే ఈ వాహనాలు రోడ్డెక్కలేదని తెలుస్తోంది.

ఆలూరు మండలంలో ఏపీ సివిల్ సప్లయ్ దుకాణాలు 33, రేషన్ కార్డుదారులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసేందుకు 10 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. వాహన ఆపరేటర్, అసిస్టెంట్ ఇద్దరికి రూ.26,500 చెల్లిస్తున్నారు. కోయా నగరం సివిల్ సప్లయ్ షాప్-31 వద్ద రాయితీ బియ్యం కోసం కార్డుదారులు బారులు తీరారు. విచారిస్తే. ఏడాదిగా ఎండీయూ వాహనదారులు బియ్యం పంపిణీ చేయడం లేదని కార్డుదారులు తెలిపారు. ఏ ఒక్క వాహనం కూడా రోడ్డెక్కలేదని తెలుస్తోంది. అయితే.. రెవిన్యూ రికార్డుల్లో మాత్రం నెలనెల ఎండీయూ వాహన ఆపరేటర్లు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చూపించి ఒక్కో వాహనానికి రూ. 26.500 చెల్లిస్తున్నారు. పది వాహనాలకు

### రోడ్డెక్కకపోయినా ఆపరేటర్లకు జీతాలు

నెలకు రూ.2.65 లక్షలు చొప్పున ఏడాది కాలంలో రూ.31.80 లక్షలు చెల్లించినట్లు తెలుస్తున్నది. ఆ వాహనాలు ఎక్కడున్నాయో ఆరా తీయగా ఉపాధ్యాయ నగర్‌లోని ఆపరేటర్ ఇంటి ముందు మూడు వాహనాలు ఆపేశారు. వాటికి మాజీ సీఎం జగన్ ఫొటో స్టిక్కర్ కూడా తొలగించలేదు. దుమ్ము ధూళితో నిండిపోయాయి. అంటే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వాహనాలు రోడ్డెక్కలేదని తెలుస్తున్నది. అయినా.. బియ్యం పంపిణీ చేసినట్లు రికార్డుల్లో చూపించి నెలనెలా రెవిన్యూ అధికారులు జీతాలు ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటి..? ఈ భాగోతంలో అధికారులకు కూడా వాటా ఉందన్న ఆరోపణలు లేకపోలేదు. హొళగుంద, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడబూరు మండలాల్లో కూడా ముప్పాతిక శాతం ఎండీయూ వాహనాలు రోడ్డెక్కడం లేదని తెలుస్తున్నది. జిల్లాలో చాలా మండలాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. రెవిన్యూ అధికారుల వివరణ కోరిన తరువాత హడావుడిగా ఒకటి రెండు వాహనాలు రోడ్డెక్కడం కొసమెరుపు.

మిగతా 6లో..

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్

### పీజీఆర్ఎస్‌కు 101 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ సమస్యలను పరిష్కరించడంలో కొంతమంది జిల్లా, మండల స్థాయి అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని అన్నారు. సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చి గ్రీవెన్స్ కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నాయని, పరిష్కరించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వీఆర్‌ఓలు అవినీతికి పాల్పడుతున్నట్లు పలు ఆరోపణలు వస్తున్నాయని, అవినీతికి ఆస్కారం లేకుండా పనులు చేయాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా 14వేల భూ సమస్యలు స్వీకరించారని సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ నెల 6వ తేదీలోపల అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో పీజీఆర్ఎస్ కింద 730 సమస్యలు, బియాండ్ ఎస్ఎల్ఏ లో 44, రీఓపన్‌లో 21 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటిని నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో 101 మంది తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

### 'దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం'

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో భూ సమస్యలను పరిష్కరించి సంబంధిత భూ ఉత్తర్వులు బాధితులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు, ఆర్డీఓల కార్యాలయాల్లో చుట్టూ తిరిగి విసిగి వేశారిపోయామని బాధిత రైతులు విన్నవించడంతో ఇందుకు సంబంధించిన రికార్డులను తెప్పించుకొని పరిష్కరించామన్నారు.

## సమైక్య భోజనం..

- నారాయణపురంలో తరతరాల ఆచారం
- గర్జ లింగేశ్వరుడి సన్నిధిలో భోజనం రాశి
- ప్రత్యేక పూజల అనంతరం సహపంక్తి భోజనం
- ఏటా కార్తీక అమావాస్య మరుసటి రోజు ఆచారం

6

## జీడీపీ కింద రబీ సాగుకు సన్నద్ధం..!

- 15 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఐఏబీ తీర్మానం
- నేటి నుంచి కాలువలకు నీటి విడుదల

7



అన్నం రాశిపై బండారు చల్లుతున్న అర్చకులు





గర్జి లింగేశ్వర స్వామి సన్నిధిలో భోజనం ఆరగిస్తున్న ప్రజలు

# సమైక్య భోజనం..

- నారాయణపురంలో తరతరాల ఆచారం
- గర్జి లింగేశ్వరుడి సన్నిధిలో భోజనం రాశి
- ప్రత్యేక పూజల అనంతరం సహపంక్తి భోజనం
- ఏటా కార్తీక అమావాస్య మరుసటి రోజు ఆచారం

**ఆదోని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :** వేకువజామునే ఊళ్లోని మహిళలందరూ తలంటు పోసుకొని నిష్ఠతో భోజనం వండారు. ఇంటిల్లిపాదికీ సరిపడా అన్నం చేశారు. ఆ పాత్రలను నేరుగా తీసుకువెళ్లి గర్జి లింగేశ్వరుడి ఆలయం సన్నిధిలో రాశి పోశారు. గ్రామంలోని అందరూ ఇలా చేశాక గ్రామ పెద్దలు, పూజారులు ఆ భోజనం రాశికి పూజలు నిర్వహించి, పసుపు బండారు జల్లారు. కులం లేదు..మతం లేదు..వయో భేదం లేదు... అందరూ ఆలయం ఎదుట వరుసగా కూర్చొని ఆరగించారు. ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం అబ్బురపరిచే ఈ సమైక్య భోజనాలు నిర్వహించారు. ఈ గ్రామంలో తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. గ్రామంలోని గర్జ లింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం తరువాత వచ్చే అమావాస్య మరుసటి రోజున స్వామి సన్నిధిలో ఊరుమ్మడి భోజనం రాశి ఏర్పాటు చేసి పూజించి, అనంతరం సహపంక్తి భోజనాలు చేయడం ఈ ఊరి సంప్రదాయం. ఈ సంప్రదాయం తమ గ్రామాన్ని ఐక్యంగా ఉంచుతోందని ఊరి పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దేవాలయం సన్నిధిలో సహపంక్తి భోజనం చేస్తున్న గ్రామస్థులు



### తరతరాల పద్ధతి

తరతరాలుగా ఈ సంప్రదాయం మా ఊళ్లో కొనసాగుతోంది. కులమతాలకు అతీతంగా, ఊరందరం కలిసి దైవ సన్నిధిలో సహపంక్తి భోజన చేస్తాం. ఇలా చేస్తే ఊరికి మంచి జరుగుతుందని మా పెద్దలు చెప్పారు.

-లింగారెడ్డి



### మంచి జరుగతుందని..

గ్రామంలోని ప్రతి ఇంట్లో రోజు తినే భోజనాన్ని తయారు చేసి గర్జ లింగేశ్వర స్వామి సన్నిధిలో ఉంచుతాం. స్వామి సన్నిధిలోనే భోజనం చేస్తే మంచి జరుగుతుందని మా నమ్మకం.

-అయ్యప్పరెడ్డి



### కరువు దరిచేరదు

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి వస్తున్న ఆచారం. కార్తీక పూజల అనంతరం పెద్ద పండుగలా ఈ వేడుకను చేసుకుంటాం. కుల మతాలకు అతీతంగా ఒక చోటకు చేరి అన్నం తినడం సంప్రదాయంగా వస్తోంది. ఇలాచేస్తే కరువు దరిచేరదని మా నమ్మకం.

-రామచంద్రారెడ్డి



గర్జి లింగేశ్వర స్వామి సన్నిధిలో భోజన రాశి



### కుల మతాలకతీతంగా..

కుల మతాలకు అతీతంగా గ్రామంలోని అన్ని కుటుంబాలవారు ఒకే చోట చేరి సహపంక్తి భోజనం చేస్తాం. అలా చేస్తే మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని నమ్మకం. ఈ ఆచారం పెద్దల కాలం నాటి నుంచి వస్తుంది. మేము కూడా అలానే పాటిస్తున్నాం.

- శేఖర్, మాజీ ఎంపీటీసీ

# కాయితాల మీదే ఇంటింటికి బియ్యం

(5వ పేజీ తరువాయి)



కర్నూలు నగరం ఓల్డ్‌టౌన్, కొత్తపేట, లేబర్ కాలనీ, బుధవార పేట.. తదితర కాలనీలో ఎండీయూ వాహనాలు ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నారా..? అని పరిశీలిస్తే.. ఇక్కడ బియ్యం అక్రమ కొనుగోలు భాగోతం వెలుగు చూసింది. కార్డుదారులు వేలి ముద్రలు (తంబ్) వేయించుకుంటారు. బియ్యం కావాలా..? డబ్బులు కావాలా..? అని అడుగుతారు. కార్డుదారులు డబ్బులు కావాలంటే కిలో రూ.10 ప్రకారం లెక్కకట్టి ఇస్తున్నాడు. ఐదుగురు సభ్యులు ఉన్న కార్డుదారుడు బియ్యం వద్దంటే 25 కిలోలకు రూ.250 ఇస్తున్నారు. ఎండీయూ వాహనాలు బియ్యం అక్రమ రవాణాకు అడ్డాగా మారాయి. కార్డుదారుడితో కిలో రూ.10కు కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలో రూ.14-16కు మాఫియాకు విక్రయిస్తున్నట్లు సమాచారం. సగం కార్డుదారులు ఎండీయూ వాహనాల ఆపరేటర్లకే బియ్యం ఇచ్చేసి డబ్బులు తీసుకుంటున్నారని తెలుస్తున్నది. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని సమాచారం. పేదలకు ఆకలి తీర్చి 'ఆహార భద్రత' కల్పించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిలో రూ.40.50 ఖర్చు చేస్తున్నది. కార్డుదారుల నుంచి కేవలం రూ.10కు ప్రకారం సేకరించి రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు.

### విచారించి చర్యలు తీసుకుంటాం

ఆలూరు మండలంలో 10 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ప్రతి నెల ఒకటో తారీఖు నుంచి 15వ తేది వరకు ఇంటింటికి వెళ్లి కార్డుదారులకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు బియ్యం పంపిణీ చేయాలి. ఒక్కో వాహనానికి రూ.26,500 ప్రభుత్వం ఇస్తుంది. ఏడాదిగా ఈ వాహనాలు రోడ్డెక్కలేదనే విషయం నా దృష్టికి రాలేదు. విచారించి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

- గోవిందుసింగ్, తహసీల్దార్, ఆలూరు

### తక్షణ చర్యలు తీసుకుంటాం

తహసీల్దార్లు ఇచ్చే రిపోర్టు ఆధారంగానే ఎండీయూ వాహనాల ఆపరేటర్లకు జీతాలు ఇస్తున్నాం. బియ్యం పంపిణీ చేయకుండానే జీతాలు తీసుకుంటున్న దానిపై విచారణ చేయిస్తాను. నిజమని తేలితే చర్యలు తప్పవు. ఎండీయూ వాహనాల ఆపరేటర్లు కొందరు వాహనాల వద్దే బియ్యానికి బదులుగా కిలోకు రూ.10 లెక్క కట్టి డబ్బులు ఇవ్వడం నేరం అవుతుంది. ఆకస్మిక తనిఖీలు చేస్తాం. మా తనిఖీల్లో తెలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- రఘువీర్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు, కర్నూలు

# మిరప రైతును ఆదుకోండి

**కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే గౌరు చరిత**



కలెక్టర్‌తో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** మిరప రైతు నాగయ్యను ఆదుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత కలెక్టర్‌ను కోరారు. కల్లూరు మండలం కొంగనపాడు గ్రామానికి చెందిన రైతు నాగయ్య 13 ఎకరాల్లో వేసిన మిరప పంట కుప్పలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, దీంతో దాదాపు రూ.30 లక్షలు నష్టం వచ్చిందని, ఆ రైతును ఆదుకోవాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్ బాషాకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వే నెం.166, 125/4లోని 13 ఎకరాల్లో మిర్చి పంట రైతు నాగయ్య పండించాడన్నారు. కల్లంలోని మిరప పంటను నాలుగు కుప్పలుగా ఎండబెట్టగా. ఈ ఏడాది జనవరి 17న రాత్రి 7.30 గంటలకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మిరప నిప్పు పెట్టారని తెలిపారు. దాదాపు 150 క్వింటాళ్లు మిరప పంట కాలిపోయిందని చెప్పారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ద్వారా పరిహారం మంజూరు చేయాలని కోరారు. అలాగే ఓర్వకల్లు మండలం బైరాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులుకు పాస్ పుస్తకాలు ఉన్నా సంబంధిత భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, అలాగే కల్లూరు మండలం ఎ.గోకులపాడు పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్య ఉందని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాగన్న, బైరాపురం రైతులు పాల్గొన్నారు.

## మైనార్టీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** డీఎస్సీ-2024కు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎస్. పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 12లోపు Www.apced-mmwd.org వెబ్‌సైట్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నేడు ఏఐవైసీ వ్యవహారాల ఇన్‌చార్జి రాక

**కర్నూలు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి నగరానికి రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

# నివేదికలు సిద్ధం చేయండి: కలెక్టర్

**నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 10,11 తేదీలలో నిర్వహించే ముఖ్యమంత్రి సమావేశానికి సంక్షిప్త నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ స్పెషల్ అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేసి పారిశుధ్య కార్యక్రమాలపై మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ భవనంలో టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 139 ఇంటర్మీడియట్ కాలేజీల్లో 5,861 మంది విద్యార్థుల్లో 2,252 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారని తక్కువ శాతంతో పాస్ కావడానికి గల కారణాలేంటని డీవీఐఓను కలెక్టర్ ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు కాలేజీ ప్రిన్సిపాళ్లందరితో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### రెడ్‌క్రాస్ అభివృద్ధికి సభ్యత్వాల సమోదు

జిల్లాలో ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొంది రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషిచేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో జనవరి 2025 నాటికి ప్రతినియోజకవర్గంలో 1000కిపైగా సభ్యత్వాలు నమోదు అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. తద్వారా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్‌స్టోరేజ్ సెంటర్, డిజాస్టర్-ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కేంద్రం, రెడ్‌క్రాస్ కార్యాలయం ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాల్లో ప్రజలకు రెడ్‌క్రాస్ సేవలు అందేలా కృషి చేద్దామని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, రెడ్‌క్రాస్ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్‌గురూజీ సభ్యుడు ఉస్మాన్‌భాష తదితరులు పాల్గొన్నారు.

## పంటల బీమా పథకంపై అవగాహన కల్పించాలి

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో పంటల బీమా పథకం 2024-25 పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఎఫ్‌బీవై కింద శనగలు, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలకు ఈనెల 15లోపు, వరి పంటకు ఈనెల 31లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు ఎకరాకు శనగ రూ.420, జొన్న రూ.297, వేరుశనగ రూ.480, ఉల్లిగడ్డ రూ.1350, వరి పంటకు ఎకరాకు రూ.630 బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. రుణం తీసుకోని రైతులు ఆధార్ కార్డు, పొలానికి సంబంధించిన పత్రాలు, ఫోన్ నెంబర్, బ్యాంక్ పాసుబుక్ మొదటి పేజీలు సమర్పించి బీమా చేసుకోవా లన్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసు కున్న రైతులకు తీసుకున్న రుణంలోనే ప్రీమియం మినహాయించుకుని రుణం ఇస్తారని, ఆ రైతులు బీమా చెల్లించాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. వివరాల కోసం టోల్‌ఫ్రీ నెం.1800-209-3536, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ క్లస్టర్ మేనేజర్ 9059634144లను సంప్రదించాలన్నారు. జేసీ డా.బి. నవ్య, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వలంటీర్లు

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోని 2.6 లక్షల మంది గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లోకి తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. వలంటీర్లను విధుల్లో తీసుకోవాలని కోరుతూ సోమవారం రాజవిహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. నగేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల వేతనం ఇవ్వడంతో పాటు వెంటనే విధుల్లోకి తీసుకుని బకాయి జీతాలు విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి, యువజన సంఘాలు గ్రామ, వార్డు వలంటీర్లకు మద్దతుగా నిలవాల్సి వస్తుందని హెచ్చరించారు. వలంటీర్ల పోరాటానికి డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు అంజి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, సాయిఉదయ్ పాల్గొన్నారు.

# పెట్టుబడిదారుల ఊడిగంలో ప్రభుత్వాలు

- కర్నూలులో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్




బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్


**కల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. సోమవారం చెన్నమ్మ సర్కిల్ కూడలిలో నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీపీఎం 3వ బహిరంగసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలను కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు మద్దతుగా మారి ప్రజలపై భారీగా భారాలు వేస్తున్నారని విమర్శించారు. ప్రజల కంటే కార్పొరేట్లకు మేలు చేయడానికి ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని, లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేయడానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. రైతులు దివాలా తీస్తున్నారని, గిట్టుబాటు ధరల కోసం ఢిల్లీలో రైతులు ఉద్యమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. 2014లో సీఎం చంద్రబాబు గెలిచినపుడు జిల్లా సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తానని చెప్పి 10 ఏళ్లు గడచినా గంపెడు మట్టి వేయలేదని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# కుక్కల దాడులపై వినూత్న చిత్రం

**కోటేష్ ప్రతిభకు నిదర్శనం**

**నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ వినూత్నంగా చిత్రం వేసి మంచి సందేశాన్ని ఇచ్చారు. ఎ3 డ్రాయింగ్ షీట్ మీద ఒలికిన కాఫీతో వీధి కుక్కల దాడుల దృశ్యం కనిపించేలా చిత్రం వేశారు. మైక్రో బ్రష్ ద్వారా ఆయన చిత్రం వేశారు. తెలుగు రాష్ట్రాల్లో వీధి కుక్కలు ప్రజల మీద దారుణంగా దాడి చేస్తున్నాయి. వీటిని కళ్లకు కట్టినట్టుగా చిత్రకారుడు కోటేష్ చిత్రీకరించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు.



కుక్కల దాడి సంఘటనపై చిత్రం

## విద్యార్థి ఆత్మహత్య

**వెల్దుర్తి/వెల్దుర్తి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** వెల్దుర్తి మండల పరిధిలోని ఎల్. నగరం గ్రామానికి చెందిన ఎల్లకృష్ణ (12) అనే విద్యార్థి తల్లిదండ్రులు మందలించారని పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తెలుగు మట్టి శేఖర్ కుమారుడు ఎల్లకృష్ణ వెల్దుర్తిలోని పద్మ వికాస్ కాన్వెంట్‌లో చదువుకుంటున్నారు. ఐదురోజుల నుంచి పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండటంతో ఉదయం తల్లిదండ్రులు మందలించి పొలానికి వెళ్లారు. ఇంట్లో పురుగు మందు తాగడు. కుటుంబ సభ్యులు వెల్దుర్తి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి 108లో కర్నూలుకు తరలిస్తుండగా.. మృతి చెందాడు.

## రైలు ఢీకొని..

**నంద్యాల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** నంద్యాలలోని బొమ్మలసత్రం సమీపంలో రైలు ఢీకొని విద్యార్థి సోమవారం మృతి చెందాడు. ఈ ఘటన జరిగింది.



సతీష్ (ఫైల్)

డోన్‌కు చెందిన సతీష్ బొమ్మలసత్రంలోని ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ నంద్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం ఉదయం బహిర్భూమికి సమీపంలోని రైల్వేట్రాక్ మీద నడుచుకుంటూ వెళ్తుండగా సతీష్‌ను రైలు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాల మార్చురీ గదికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఇలా ఉండగా విద్యార్థి మృతి పట్ల రాయలసీమ విద్యార్థి జేఏసీ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. హాస్టల్లో నీటి వసతి, టాయిలెట్లు, బాత్‌రూములు సరిగా లేనందునే విద్యార్థి బహిర్భూమికి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. ఈ సమస్యలను పలుమార్లు అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు.

## టికెట్ల గోల్‌మాల్‌పై విచారణ



విచారణ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరీదేవి

**మహానంది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** మహానంది ఆలయంలో గత నెల 17 వ తేదిన జరిగిన సేవా దర్శనం టికెట్ల విక్రయం గోల్‌మాల్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరీదేవి ఆలయ అధికారులను విచారించారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆలయ ఏఈవో మధుతో పాటు సిబ్బందిని ఎస్పీ విడివిడిగా సేవా దర్శనం టికెట్ల విక్రయాలతో పాటు ఆలయంలో జరిగే అవినీతి అక్రమాల ఆరోపణలపై విచారించారు. అలాగే దేవస్థానంలో వివిధ విభాగాల రికార్డులను కూడా పరిశీలించారు. అయితే ఎస్పీ విచారణ సమయంలో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి అందుబాటులో లేక పోవడంతో విచారణ పూర్తి కాలేదని ఎస్పీ చెప్పారు. మరోసారి మహానందిలో ఆలయ అధికారులతో విచారించిన తర్వాత నివేదికలను ఉన్నత స్థాయి అధికారులకు పంపుతామని తెలిపారు. అనంతరం మహానంది ఆలయంలో విజిలెన్స్ ఎస్పీ స్వామి, అమ్మవార్లను దర్శించుకొన్నారు. వీరి వెంట విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రంలో దొంగతనం



ఎరువుల దొంగతనం జరిగిన గోడౌన్

**ఆదోని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ఆదోని మండలం పెద్దహరివాణం రైతుభరోసా కేంద్రంలో దొంగలు పడ్డారు. రైతులకు సబ్సిడీ కింద పంపిణీ చేసే యూరియా ఎరువు సంచులను ఎత్తుకెళ్లారు. గ్రామంలోని ఏపీజీబీ బ్యాంకు పక్కన గోడౌన్‌లో వ్యవసాయ అధికారులు ఎరువుల సంచులను ఉంచారు. నవంబరు 26వ తేదీన గోడౌన్ తలుపులు పగిలిపోయి కనిపించడంతో వాచ్‌మెన్ ఆదెప్ప బ్యాంకు మేనేజర్ బాలకృష్ణకు సమాచారం ఇచ్చారు. మేనేజర్ ఏఈవో సమాధానమ్మకు తెలియజేశారు. ఏఈవో మహిళా పోలీసు సహకారంతో గోడౌన్ తెరిచి చూడగా, 59 యూరియా బ్యాగులతోపాటు రికార్డులను ఎత్తుకెళ్ళినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఇస్వీ పోలీసులకు ఏఈవో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

## రూ.1.52 కోట్లకు ఐపీ

**రుద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** మండలంలో మొక్కజొన్నల వ్యాపారి రూ.1.52.95,000కు ఐపీ పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో రైతుల నుంచి మొక్కజొన్నలు కొనుగోలు చేసి కనిపించకుండా ఐపీ నోటీసులు మంజూరు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 87 మంది రైతులకు నోటీసులు అందాయని సమాచారం. రుద్రవరంతోపాటు కొండమాయపల్లె, అప్పనపల్లె గ్రామాల్లో మొక్కజొన్నలు కొనుగోలు చేశారు. ఎస్ఐ వరప్రసాద్‌ను వివరణ కోరగా నవంబరులో రైతుల ఫిర్యాదు మేరకు మొక్కజొన్నల వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం నోటీసులు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

**కోడుమూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొత్తూరు-ప్యాలకుర్తి గ్రామాల మధ్యన ఆదివారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ కారణంగా కారు దగ్ధమయ్యింది. కర్ణాటకలోని ధార్వాడకు చెందిన నాగరాజు, శివానంద కుటుంబంతో కలిసి శ్రీశైలం వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో కొత్తూరు దాటిన తర్వాత కారు ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. దీంతో ఆందోళన చెంది భార్యాపిల్లలతో కలిసి కిందకు దిగారు. కొద్దిక్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. దీంతో దూరంగా పరుగుతీసి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కారు పూర్తిగా కాలిపోయింది.

## సృజనాత్మక విద్యకే వర్చువల్ క్లాసులు



మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు సృజనాత్మక విద్య అందించేందుకే రాష్ట్రంలోప్రథమంగా కర్నూలు జిల్లాలో వర్చువల్ క్లాసులకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారని, డీఈవో శ్యామూల్ పాల్ తెలిపారు. సోమవారం జడ్పీ ప్రాంగణంలోని జడ్పీ హాలులో కర్నూలు డివిజన్ హెచ్ఎంల సమావేశాన్ని నిర్వహించారు. అపార్, టీఎన్ఏ సర్వేలోనూ అశ్రద్ధ చేయరాదని సూచించారు. పేరెంట్స్ మెగా మీటింగ్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఇప్పటి నుంచే చేపట్టాల్సిన సూచనలు చేశారు. కర్నూలు ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

# రబీ సాగుకు సన్నద్ధం!

- జీడీపీ కింద 15 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని ఐఏబీ తీర్మానం
- నేటి నుంచి కాలువలకు నీటి విడుదల
- సన్నాహాలు చేస్తున్న ఇంజనీర్లు
- గేట్ల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టిన ఇంజనీర్లు



గాజులదిన్నె ప్రాజెక్టు

**కర్నూలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** గాజులదిన్నె ప్రాజెక్టు కింద రబీ సాగుకు రైతులు, ఇంజనీర్లు సన్నద్ధం అవుతున్నారు. రబీ సీజన్‌లో 15 వేల ఎకరాకలకు సాగునీరు ఇవ్వాలని ఐఏబీ సమావేశంలో తీర్మానించారు. గతేడాది తాగునీటి అవసరాలు దృష్ట్యా సాగునీరు ఇవ్వకపోవడం వల్ల రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఈ ఏడాది తప్పకుండా రైతులకు సాగునీరు ఇవ్వాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పట్టుబట్టారు. ఆ దిశగా ఇంజనీర్లు కూడా సాగు ప్రణాళికలను సిద్ధం చేశారు. మంగళవారం పంట కాలువలకు ఎమ్మెల్యే బీవీ సాగునీరు విడుదల చేసారని ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్ ఆంధ్రజ్యోతికి వివరించారు. అదే క్రమంలో గత వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు కాక ఆగిపోయిన ఆనకట్ట ఎత్తు పెంచడం, నూతన క్రస్‌గేట్లు ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీడీపీ జలాశయం ద్వారా గోనెగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ మండలాల్లో 21 గ్రామాలకు రబీ సీజన్‌లో 25,454 ఎకరాలు ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. డోన్, కృష్ణగిరి, బండగట్టు తాగునీటి పథకాల ద్వారా డోన్ పట్టణం సహా వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా.. సోమవారం నీటి లెక్కలు కొలిచే సమయానికి 2.79 టీఎంసీల నిల్వ ఉంది. 40 క్యూసెక్కులు హంద్రీనీవా కాలువ నుంచి వచ్చి చేరుతోంది. డెడ్ స్టోరేజీ పోను 2.14 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం (లైవ్ స్టోరేజీ) ఉంది. నవంబరు 26న కలెక్టరు పి.రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగిన రబీ ఐఏబీ సమావేశంలో 15 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. సాగు కోసం 1.50 టీఎంసీలు అవసరం ఉంది. అయితే.. నీటి లభ్యత దృష్ట్యా 12-13 వేల ఎకరాలకు తగ్గకుండా సాగు నీరు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మంగళవారం ఎమ్మిగ నూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నారు. గతేడాది తాగునీటి అవస రాల దృష్ట్యా ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. ప్రస్తుతం ఆ పరిస్థితి తలెత్త కుండా ముందస్తు ప్రణాళికతో సాగునీరు ఇచ్చేలా సన్నాహాలు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### హంద్రీ నీవా నీటిని తీసుకుంటేనే..

జీడీపీ ద్వారా సాగు, తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలంటే హంద్రీనీవా కాలువ, తుంగభద్ర దిగువ కాలువ నుంచి జీడీపీకి నీటిని తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి ద్వారా 12-13 వేల ఎకరాలకు సాగునీరు, ఆయా గ్రామాలకు తాగునీరు ఏప్రిల్ వరకు ఎలాంటి సమస్య తలెత్తకుండా ఇవ్వవచ్చు. మే, జూన్ నెలల్లో నీటి సమస్యను అధిగమించాలంటే హంద్రీనీవా కాలువ ద్వారా రోజుకు 300 క్యూసెక్కులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తాజాగా వంద క్యూసెక్కులు విడుదల చేస్తే జీడీపీకి 40 క్యూసెక్కులు చేరుతున్నాయి. చిత్తూరు జిల్లా కుప్పంకు కృష్ణా జలాలు తీసుకెళ్లాలనే లక్ష్యంగా గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటి విడుదలను ఆపేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే బీవీ జోక్యం చేసుకొని హంద్రీనీవా ఇంజనీర్లతో మాట్లాడి 300 క్యూస్కెలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ఎల్లెల్సీ పరిధిలో వరి కోతలు ఉన్నాయి. ఎల్లెల్సీ నీటిని కూడా జీడీపీకి మళ్లించి నిల్వ చేస్తే మే, జూన్ నెలల్లో కూడా సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేయవచ్చు.

### క్రస్ట్‌గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభం

ఆగిపోయిన క్రస్ట్‌గేట్ల ఏర్పాటు పనులకు ఎట్టకేల కు శ్రీకారం చుట్టారు. జీడీపీ సామర్థ్యం 4.50 టీఎంసీలు నుంచి 5.50 టీఎంసీల సామర్థ్యం పెంపు, తప్పు పట్టి పాడైపోయిన క్రస్ట్‌గేట్లు స్థానంలో నూతన క్రస్ట్‌గేట్లు ఏర్పాటు పనులు వైసీపీ ప్రభుత్వ హ యాంలో చేపట్టారు. రూ.35 కోట్లతో ఆనకట్టు ఎత్తు పెంచే పనులు, రూ.12 కోట్లతో కొత్త క్రస్ట్‌గేట్లు ఏర్పాటు పనులు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వక పోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అసంపూర్తి పనులపై ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఎమ్మెల్యే బీవీ జీడీపీ ఇంజనీర్లు, కాంట్రాక్టరుతో చర్చించి ఆగస్టులోనే కొత్తగా నాలుగు గేట్లు ఏర్పాటు చేశారు. మరో రెండు గేట్లు ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతు న్నాయి. కాంట్రాక్టర్‌కు బకాయి బిల్లులు చెల్లించి అసంపూర్తి పనులు పూర్తి చేయించి ఆయకట్టుకు సాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



జీడీపీ కుడి కాలువ



క్రస్ట్ గేట్ల పనులు

**15 వేల ఎకరాలకు నీరివ్వాలని నిర్ణయం**

జీడీపీ కింద రబీలో 15 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఐఏబీలో నిర్ణయం తీసుకున్నారు. పంట కాలువలకు నేడు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చేత విడుదల చేయించేందుకు ఏర్పాట్లు చేశాం. రైతులకు సాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఆరు క్రస్ట్‌గేట్లలో నాలుగు కొత్త గేట్లు ఏర్పాటు చేశాం. మరో రెండు గేట్లు ఏర్పాటు పనులు మొదలు పెట్టాం.

**- శైలేశ్వర్, ఈఈ, టీబీపీ ఎల్లెల్సీ డివిజన్, ఆదోని**

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 90 అర్జీలు

**నంద్యాల క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 90 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. సివిల్ తగాదాలు, కుటుంబకలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్థలు తదితరాలపై ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్‌బాబు పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

## యువకుడి అనుమానాస్పద మృతి

- పరిశీలించిన డీఎస్పీ బాబుప్రసాద్

**కోడుమూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని వర్కూరు పొలిమేరలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వేప చెట్టుకు ఉరి వేసుకొని కనిపించినా అది హత్యే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చనుగొండ్ల గ్రామానికి చెందిన ఉప్పరి శ్రీరాములు, రామేశ్వరి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరి చిన్నకుమారుడు శివ (26) ఇంటికి సమీపంలో పంక్చర్ షాపు నిర్వహిస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. శివ అవివాహితుడు కావడంతో రోజూ రాత్రి పూట పంక్చర్ షెడ్‌లో నిద్రించేవాడు. అయితే ఆదివారం అమావాస్య కావడంతో తల్లి రామేశ్వరి దేవుని దర్శనం కోసం వెళ్లింది. తండ్రి శ్రీరాములు కోళ్ల ఫారంలో పనికి కుదరడంతో అక్కడికి వెళ్లాడు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్తున్న కొందరు షెడ్ పక్కన బైక్ ధ్వంసమైనట్లు గుర్తించారు. షెడ్‌లో శివ లేకపోవడం, గ్రీజ్ మిషన్, హోమ్ థియేటర్ ధ్వంసం కావడం, ఇతర సామగ్రి చిందరవందరగా పడి ఉండడం గమనించారు. దీంతో శివ సోదరులను నిద్రలేపి గూడూరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు శివ మొబైల్ లోకేషన్ ట్రాక్ చేసి అందరూ కలిసి వెతికారు. చివరకు గ్రామానికి సుమారు 6 కి.మీ దూరంలో జీడీపీ కెనాల్ పక్కన ఓ పొలంలో వేప చెట్టుకు ఉరికి వేలాడు తున్న శివ మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలిసి డీఎస్పీ బాబుప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. డాగ్, క్లూస్ టీంలను రంగంలోకి దింపారు. ఘటనాస్థలిలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నం టాయి. తమ కుమారుడిని హత్యచేసి ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ఉరివేశారని తల్లిదండ్రులు, సోదరులు ఆరోపించారు. సీఐ తబ్రేజ్, ఎస్ఐలు శ్రీనివాసులు, తిమ్మయ్య ఆధ్వర్యంలో మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.ట



రోదిస్తున్న మృతుడి సోదరి, ఇన్‌సెట్‌లో ఉప్పరి శివ (ఫైల్)

## అత్యాశకు పోవొద్దు..

- క్రిప్టో కరెన్సీ కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసులు



వివరాలు వెల్లడిస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

**డోన్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** అధిక డబ్బు వస్తుందన్న అత్యాశకు వెళ్లి మొదటికి మోసం తెచ్చుకోవద్దని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి పట్టణంలోని సీఐ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిప్టో కరెన్సీ కేసులో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. డోన్ పట్టణం కొత్తపేటలో నివాసముంటున్న రామాంజనేయులు 2021 నవంబరు నుంచి ఒక ఆయుర్వేదిక్ షాపులో పని చేస్తూ.. అదే ప్రాంగణంలో సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ప్రజలకు రూ.లక్ష పెట్టుబడి చేస్తే.. ప్రతి నెలా రూ.10వేలు అందిస్తానని ఆశ చూపాడు. క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ ద్వారా లాభాలు వస్తాయని నమ్మించి డోన్ పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 315 మంది నుంచి రూ.23 కోట్ల అక్రమ డిపాజిట్ల రూపంలో సేకరించాడు. వాటిని విడతల వారిగా వడ్డీ రూపంలో వారికే సుమారు రూ.17 కోట్లు చెల్లించాడు. ప్రారంభంలో డిపాజిటర్లకు వడ్డీ చెల్లిస్తూ నమ్మించి మోసం చేస్తూ అధిక డిపాజిట్లు పొందాడు. సెప్టెంబరు నుంచి వడ్డీ చెల్లించడం నిలిపివేవాడు. ఈ మేరకు నిందితుడు రామాంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేసి సాక్షులను విచారించారు. నిందితుడు బ్యాంకు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.2.45 కోట్లను ఫ్రీజ్ చేశారు. సోమవారం తమ పోలీసు ప్రత్యేక బృందం రామాంజనేయులును అరెస్టు చేసి మోటారు సైకిల్, సెల్‌ఫోన్‌ను కేసుకు సంబంధించిన ఇతర ముఖ్యపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ నరేంద్ర కుమార్, శరత్ కుమార్ రెడ్డి, రూరల్ ఎస్ఐ మమత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వాగులో పడ్డ కారు

**పాణ్యం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని తమ్మరాజుపల్లె సమీపంలోని అడ్డవాగులో సోమవారం తెల్లవారుజామున కారు పడిన నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. అరుణాచలం నుంచి హైదరాబాదుకు వెళ్తున్న విజయవాడకు చెందిన కారు తెల్లవారుజామున అడ్డవాగులో పడినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. హైవే రహదారి వంతెన ఇరుకుగా ఉండడం వల్లే ఈ ప్రమాదమేర్పడిందని బాధితులు పేర్కొన్నారు. విజయవాడకు చెందిన పద్మనాభం, శ్రీదేవి, దీప్తి, జయశేఖర్‌లు గాయాలపాలయ్యారు. వీరిని హుటాహుటిన శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన పది గంటల ముందే ఇక్కడే ఆటో వంతెనను ఢీకొని నలుగురు నంద్యాల వాసులు గాయాలపాలైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## 8న సాగునీటి ఎన్నికలు



మాట్లాడుతున్న తహసీల్దార్ షేక్ మెహిద్దీన్

**గోస్పాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని 6 డబ్ల్యూయూఏలకు 8న సాగునీటి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షేక్ మెహిద్దీన్ తెలిపారు. మండలంలో మొత్తం 6 డబ్ల్యూయూఏలు ఉండగా ఒక్కొక్క దానికి 12ల చొప్పున 72 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తామని, మండలంలోని 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీసీకి పోటీ చేసే రైతు అతని పేరు ఏ నెంబర్ టీసీలో ఉందో దానికే పోటీ చేయాలని, ప్రపోజల్ చేసే వ్యక్తి కూడా అదే టీసీ చెందిన వ్యక్తి అయి ఉండాలన్నారు. ఇద్దరు సంతానం మాత్రమే కలిగి ఉండాలని, నీటి పన్ను కలిగి ఉండాలని, కోర్టు కేసులు ఉండరాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులన్నారు. పోటీ చేసే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ గాని ఏదో ఒక గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు.

## మహానందిలో ఆర్‌యూ వీసీ పూజలు



మహానందిలో ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్‌కు స్వామివారి మెమెంటోను అందజేస్తున్న అధికారులు

**మహానంది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :** మహానంది క్షేత్రంలో రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్‌టీకె నాయక్, ఎగ్జామ్స్ కంట్రోలర్ డాక్టర్ వెంకటేశ్వర్లులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయ ముఖమంటపం వద్ద వీరికి పర్యవేక్షకుడు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లను దర్శించుకొని అభిషేకార్చనలు జరిపారు. కల్యాణ మంటపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. వీరి వెంట నంద్యాల రామకృష్ణ కళాశాల అధినేత గడ్డం రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

## విరిగిన చెట్టు

### ట్రాఫిక్‌కు అంతరాయం



బుక్కాపురం సమీపంలోని రహదారిపై అడ్డంగా పడిన చెట్టు

**మహానంది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :** మహానంది మండలం బుక్కాపురం సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టును వడ్ల లోడుతో వెళ్తున్న లారీ సోమవారం రాత్రి ఢీకొట్టింది. దీంతో చెట్టు భారీ కొమ్మ విరిగి ప్రధాన రహదారిపై పడింది. నంద్యాల నుంచి మహానంది వైపు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. రెండు గంటల పాటు ఎక్కడి వాహనాలు నిలిచియాయి. పోలీసులు అక్కడికి చేరుకొని స్థానికుల సహకారంతో చెట్టు కొమ్మను పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## పేద రైతులకు ఉచితంగా ఎద్దులు



శ్రీకృష్ణ గోశాల వద్ద రైతులకు ఎద్దులను అప్పగించి పత్రాన్ని అందజేస్తున్న ఎస్ఐ

**మిడుతూరు, డిసెంబరు 2( ఆంధ్రజ్యోతి):** మండల పేద రైతులకు ఎద్దులను శ్రీకృష్ణ గోశాల కమిటీ సభ్యులు ఎద్దులను ఉచితంగా అందజేశారు. జలకనూరు గ్రామానికి చెందిన శేషన్న, రోళ్లపాడు గ్రామానికి చెందిన చిన్నమల్లికార్జున, రాముడు, చెరుకుచెర్ల గ్రామాకి చెందిన చిన్నరాముడు, బిజినేముల గ్రామానికి చెందిన వీరేషయ్య, నరసింహ బిలకగూడూరు గ్రామానికి చెందిన వెంటరమణ, ఫుల్లారు సుబ్బన్నలకు ఎస్ఐ ఓబులేసు ఆధ్వర్యంలో 10 జతల కాడెద్దులను రైతులకు సోమవారం అందజేశారు. ఎద్దులను కమిటీ నిబంధనల ప్రకారం ఎవరికీ అమ్మడం కాని, ఎవరికీ ఇవ్వడం కాని చేయరాదని ఎద్దులను పోషించలేని ఎడల సొంత ఖర్చులతో శ్రీకృష్ణగోశాలకు అప్పగించాలని కమిటీ వారు రైతులకు సూచించారు. కార్యక్రమంలో గోశాల సంరక్షకుడు శ్రీనివాసులు, రోళ్లపాడు సర్పంచు వెంకరామి రెడ్డి, శివ రామి రెడ్డి, పశువైద్యులు డాక్టర్ నరేష్, రవి, వీరేషయ్య, మల్లిఖార్జున, వెంకటరమణ పాల్గొన్నారు.

## పంట నమోదు చేసుకోవాలి

**గడివేముల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం అందించే పథకాలకు పంట నమోదే ప్రామాణికమని, రైతులు తప్పనిసరిగా పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి హేమ సుందర్‌రెడ్డి సూచించారు. రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్న, పంట బీమా, పంట నష్ట పరిహారం పొందాలన్న పంట నమోదు తప్పనిసరి అన్నారు. రైతుల ఆధార్‌కార్డ, పొలం ధృవీకరణ పత్రాలను బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో వ్యవసాయ సిబ్బందిని సంప్రదిస్తే పంట నమోదు చేస్తారని అన్నారు.



సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న అర్చకుడు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

# వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ

**శ్రీశైలం, డిసెంబరు 2:** శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని లోకకళ్యాణార్థం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు జరిపారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు.



స్వామి, అమ్మవార్లకు పూజలు

**● శ్రీశైలంలో భక్తుల రద్దీ**

ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం శ్రీశైలం మహాక్షేత్రానికి సోమవారం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధులలో రద్దీ నెలకొంది. సోమవారం రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు సమర్పించారు. అలాగే వందల సంఖ్యలో భక్తులు దేవస్థానం కల్యాణకట్ట నందు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం త్రాగునీరు, అల్పాహారం అందజేశారు. క్షేత్రంలోని నిత్యాన్నదాన సత్రాలు భక్తులకు వసతి, అన్నదానం నిర్వహించి భక్తుల సేవలో తరించారు.

# రాయితీపై సోలార్ రూఫ్ నిర్మించుకోండి: కలెక్టర్




పీఎం సూర్యఘర్ యోజన పథకం గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, నెడ్‌క్యాప్, విద్యుత్ అధికారులు

**నంద్యాల కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులకు రాయితీపై సోలార్ రూఫ్‌లను ఏర్పాటుచేయనున్నామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో భాగంగా పీఎం సూర్యఘర్ యోజన పథకం గోడపత్రికలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాయితీపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలని సూచించారు. ఒక కిలోవాట్ రూఫ్ టాప్ ఏర్పాటుకు 100 చ దరపు అడుగు స్థలం, నెలకు 130 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇందుకోసం రూ.60-70వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఇందులో రూ.30వేల రూపాయల రాయితీ వస్తుందన్నారు. ఈ సమావేశంలో నెడ్‌క్యాప్ డవలప్‌మెంట్ అధికారి వీరేంద్రబాబు, విద్యుత్‌శాఖ ఎస్ఈ నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

**పింఛన్ల పంపిణీలో రెండో స్థానం-కలెక్టర్**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లా రెండో స్థానం నిలిచిందని కలెక్టర్ రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,16,606 మందికి గాను 2,14,777మందికి రూ.90.93కోట్ల పింఛన్ల మొత్తాన్ని పంపిణీ చేసి 99.16 శాతం పూర్తిచేశామన్నారు. ఇందులో రాష్ట్రంలో నంద్యాల జిల్లా రెండో స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## రాజకీయ వేధింపులు ఆపాలి



మండల అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**బండిఆత్మకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు రత్నం, రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఫీల్‌అస్టింట్లు, సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీవో దస్తగిరి, తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్, ఏపీవో వసుధలకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఫీల్డు అసిస్టెంట్లను రాజకీయ కారణాలతో తొలగిచటం తగదన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నాగరాజు, నాగన్న, జయసూర్యరాజు పాల్గొన్నారు.

## క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న మధుసూదనరావు

**పాణ్యం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని బలపనూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు 15 జతల క్రీడా దుస్తులు లైబ్రరీ అసిస్టెంట్ మధుసూదనరావు పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు దాత తల్లిదండ్రులు రామకృష్ణయ్య, రామకృష్ణమ్మ జ్ఞాపకార్థం దుస్తులు పంపిణీ చేశారు. క్రీడా కారులు జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా మధుసూదనరావును ఉపాధ్యాయలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీ సుజాత, ఉపాధ్యాయులు, పాఠశాలసిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయంలో దరఖాస్తు చేసుకోండి

**గడివేముల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** భూసర్వే గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలు విడదీసేందుకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. సచివాలయంలో నిర్ణీత రుసుము చెల్లించి పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. జాయింట్ ఎల్‌పీఎం నంబర్‌లను విడదీసేందుకు అధికారులకు నగదు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు.

## పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా సయ్యద్ చాంద్‌బాషా

**ఆత్మకూరురూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం నంద్యాలలో రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అద్యక్షుడిగా రాం పక్కిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ చాంద్‌బాషా,గౌరవ అధ్యక్షులుగా భార్గవ రామయ్య,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కరరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆత్మకూరు వాసి పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సయ్యద్‌చాంద్‌బాషా ఎన్నిక కావడంతో రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్, జిల్లా నాయకులు దామరేకుల రవి,హుసేన్ సాహెబ్, చంద్రశేఖర్ సాంబశివుడు,షఫీవుల్లా మునిరెడ్డి, ఆత్మకూరు కొత్తపల్లి, పాములపాడు మండల నాయకులు ప్రదీప్‌కుమార్, హనుమంతు,సయ్యద్ కలిముల్లా శ్రీనివాసులు మదన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## ప్రమాదకరంగా ఓవర్‌హెడ్ ట్యాంక్



**ఆత్మకూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఉన్న ఓవర్ హెడ్ నీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పైకప్పు కడ్డీలు తేలి వేలాడుతున్నాయి. ట్యాంకు నుంచి పట్టణంలోని పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. గత 40 ఏళ్ల కిందట నిర్మించిన ఈ ట్యాంకును కూల్చి నూతనంగా ట్యాంకును ఏర్పాటు చేయాలని అనేక సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు కోరినా పట్టించుకునే నాథుడు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకును కూల్చివేసి నూతన ట్యాంకును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## 'పోలీసు సిబ్బంది సేవలు ప్రశంసనీయం'

**శ్రీశైలం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం మహాక్షేత్రంలో జరిగిన కార్తీక మాసోత్సవాలకు పోలీస్ సిబ్బంది అందించిన సేవలకు భక్తులు, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందాయని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. శ్రీశైలం క్షేత్రానికి వేల సంఖ్యలో భక్తులు వాహనాల ద్వారా తరలి వచ్చారన్నారు. శ్రీశైలం ఘాట్ రోడ్డు, క్షేత్రపరిధిలో వాహనదారులు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకోని ట్రాఫిక్ సమస్యను నియంత్రణ చేశామని ఆయన తెలిపారు. వారాంతరాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దాదాపు 300 నుంచి 400 వందల మంది పోలీస్ సిబ్బందితో భక్తులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా విధులు నిర్వంహించినట్లు తెలుపుతూ..ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణ క్షేత్ర పరిస్థితులను తెలుసుకుంటూ పర్యవేక్షించారని చెప్పారు. డీఎస్పీ రామాంజి నాయక్ కార్తీక మాసంలో విధులు నిర్వహించిన శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు, సిబ్బందిని అభినందించారు.



పడమర ప్రాతకోటలో లక్ష బిల్వార్చన పూజలలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

**పగిడ్యాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) :** మండలంలో పడమర ప్రాతకోట గ్రామంలోని గౌరి మోక్షేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి పూజారులు రవిశర్మ, బాలకృష్ణ శర్మ, ధనుంజనేయ ఆధ్వర్యంలో గణపతిపూజ, రుద్రాభిషేకం, హోమం తదితర పూజలను నిర్వహించారు. ఆలయ సమీపంలో మధ్యాహ్నం మహిళ భక్తులు లక్ష బిల్వార్చన పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.



శివపార్వతుల కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసు రత్నం

**నందికొట్కూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** గత 30 సంవత్సరాలుగా మున్సిపల్ రంగంలో ఇంజనీరింగ్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసు రత్నం డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరులోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంజనీరింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసు రత్నం, పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు నిత్యం సేవవలందిస్తున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చినటువంటి వాగ్దానాలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్టు 1970 ప్రకారం శాశ్వత స్వభావం కలిగి ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కర్మికులకు రిస్కు అలవెన్సు అందించాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో తీసుకున్న మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, ఖాజా బాషా, నాగన్న, శ్రీను, పరమేష కార్మికులు పాల్గొన్నారు.

## బందెలదొడ్డి సమస్యను పరిష్కరించాలి

**కొత్తపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** కొత్తపల్లి మండలం ఎర్రమటం గ్రామంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న పశువుల బందెల దొడ్డి సమస్యను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, పోలీసు అధికారులు పరిష్కారం చూపాలని గ్రామానికి చెందిన గడ్డం సుబ్బరాయుడు, దుర్గం వెంకట్రాముడు, గుండి శేషన్న, దేవనూరు చిన్నమద్దిలేటి కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన ప్రజలు గ్రామానికి సంబంధించిన పంట పొలాల్లో ఎవరి పశువులైన మేత మేసి నష్టం కలుగజేస్తే.. వాటిని గ్రామంలోని బందెలదొడ్డిలో కాపలాదారులు వేసి రుసుం వసూలు చేసేవారన్నారు. అయితే ఇటీవల అగ్రవర్ణాలకు చెందిన నాయకులు బందెలదొడ్డికి వేసిన తాళంచెవిలు తీసుకుని తామే నిర్వహిస్తామని వాగ్వావాదానికి దిగారన్నారు. ఈ విషయం కొత్తపల్లి పోలీసుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇంత వరకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఈ సమస్య జటిలం కాకముందే ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ఇరువర్గాల మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు.

## అంబా సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



అంబా సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

**ఆత్మకూరురూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణంలో వెలసిన అంబా సిద్ధేశ్వరాలయంలో ఆలయ పురోహితులు మహేశ్వరయ్య ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు అనంతరం మార్గశిర మాసం బహుళ పాడ్యమి సోమవారాన్ని పురస్కరించుకుని కార్తిక మాస వేడుకలను ముగింపు పలుకుతూ నిర్వహించే ఈ ప్రత్యేక పూజల్లో పట్టణంలోని మహిళలు, శివస్వాములు పాల్గొన్నారు. అనంతరం సాయత్రం పార్వతి పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరణ గావించి పల్లకి సేవ నిర్వహించారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో శాంతిరాం విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న కళాశాల డీన్ డాక్టర్ అశోక్‌కుమార్

**పాణ్యం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :** జాతీయ పార్మసీ వారోత్సవాల్లో భాగంగా నరసరావుపేట కాలేజ్ ఆఫ్ పార్మసీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో శాంతిరాం పార్మసీ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి తెలిపారు. సోమవారం విజేతలను కళాశాల ఎండీ శివరాం, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, పిడీ మునిశంకర్ అభినందించారు.

## భూమిని ఎండోమెంట్‌లో కలపాలి



ఎండోమెంట్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న శివగంగాధర్ రెడ్డి

**మిడుతూరు, డిసెంబరు 2:( ఆంధ్రజ్యోతి):** ఆలయానికి ఇచ్చిన భూమిని ఎండోమెంట్‌లో కలపాలని రెడ్డివారి శివశంకర్ రెడ్డి, రెడ్డివారి గంగాధర్ రెడ్డి నంద్యాల జిల్లా ఎండోమెంట్ అధికారి మోహన్‌ను సోమవారం వారు కోరారు. పీరుసాహేబ్ పేట గ్రామానికి చెందిన సర్వేనెంబరు 1050లో ఉన్న 8 ఎకరాల భూమిని, 224 సర్వేనెంబరులో 2.75 ఎకరాల భూమిని మాపూర్వికులు ఆంజనేయ స్వామి, ఈశ్వర స్వామి, రామచంద్ర స్వామి ఆలయాలకు రిజిస్ట్రారు ద్వారా వ్రాయించి ఇచ్చారని వారు తెలిపారు. కాబట్టి ఆభూమిని ఎండోమెంట్‌లో కలపాలని ఎండోమెంట్ అధికారికి వారు వినతి పత్రం అందజేశారు.

## భారీ వాహనాలు తిరిగితే చర్యలు: ఎస్ఐ



వాహనదారులతో మాట్లాతున్న ఎస్ఐ

**మిడుతూరు, డిసెంబరు 2( ఆంధ్రజ్యోతి):** అనుమతులు లేని భారీ వాహనాలు రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా తిరిగితే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్ఐ ఓబులేసు హెచ్చరించారు. సోమవారం జలకనూరు బాట సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ వాహనదారులతో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగంగా అజాగ్రత్తతో నడపరాదన్నారు. వాహనాలకు రూట్ పరిమిట్‌తో పాటు లైసెన్సు తప్పకుండా ఉండాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన సూచించారు. ఈయన వెంట పోలీసులు పాల్గొన్నారు.

# డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## గంగమ్మకు సారె



చాగలమర్రిలో సారె తీసుకెళ్తున్న మహిళలు

చాగలమర్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో సోమవారం పోలిపాడ్యమి సందర్భంగా సంయుక్త కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో చీర, సారెలతో మహిళలు సామూహికంగా గ్రామోత్సవం చేశారు. ఆంజనేయస్వామి దేవాలయం నుంచి చెరువు కట్ట వద్ద వెలసి న గంగాభవాని ఆలయం వరకు చీర, సారెలతో ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ గంగమ్మకు చీర, సారె, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి సామూహికంగా ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం



హుసేనాపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

ప్యాపిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఆర్థిక మంత్రి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఆయన కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరం కలిసి కట్టుగా పనిచేద్దామన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన తండ్రి రాజారెడ్డి దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, భువనేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, కమతం బాస్కరరెడ్డి, గండికోట చిన్నరామాంజనేయులు, శ్యాం సుందర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

## 'ధర్నాకు అనుమతివ్వండి'

కొలిమిగుండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామ్‌కో సిమెంట్ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం, దుమ్ము వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ధర్నా చేసేందుకు అనుమతి ఇవ్వాలని తహసీల్దార్ బాలీశ్వర్‌రెడ్డికి, కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబుకు రైతులు వినతిపత్రం అందజేశారు. రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు వాపోయారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## చెంచులకు జన్‌మన్ పథకంపై అవగాహన



చెంచుగూడెంలో అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ డీఈ, ఏఈ

చాగలమర్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని అహోబిలం, చాగలమర్రి మండలంలోని చెంచుగూడెంలో నివాసం ఉంటున్న చెంచులకు సోమవారం హౌసింగ్ డీఈ విజయ్‌బాబు, ఏఈ నరసింహారావు ప్రధానమంత్రి జన్‌మన్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా అహోబిలంలోని చెంచులకు 12 పక్కా గృహాలు, చాగలమర్రి చెంచుగూడెంకు ఆరు పక్కా గృహాలు మంజూరయ్యాయని అన్నారు. చెంచుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా పథకాన్ని ప్రవేశపెట్టి గృహాలు మంజూరు చేశారని అన్నారు. చెంచులు పక్కా గృహాలు నిర్మించుకోవాలని కోరారు. ఆయన వెంట హౌసింగ్ ఎస్సిస్టెంట్ ఓబులేసు, ఇంజినీరింగ్ సహాయకులు ఉన్నారు.

## ప్లాస్టిక్ రహిత పట్టణమే లక్ష్యం



మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత బనగానపల్లె పట్టణమే లక్ష్యమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. నా బనగానపల్లె - నా ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రియదర్శిని పాఠశాలలో ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులకు కారణం అవుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ తగ్గించాలన్నారు. వీలైనంత వరకు జూట్, క్లాత్, పేపర్ లాంటి బ్యాగులను వాడాలన్నారు. పట్టణంలో ప్రతి నెల 15 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ఆమె సూచించారు. సమావేశంలో పాఠశాల యాజమాన్యం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావేదిక'

బేతంచెర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తుందని బేతంచెర్ల తహసీల్దార్ ప్రకాష్‌బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక తహసీల్దార్ ప్రకాష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కట్టెల లోడు ట్రాక్టర్ బోల్తా

బేతంచెర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల-బనగానపల్లె రహదారిలోని ప్రైవేట్ బంకు సమీపంలో ఎదురుగా వస్తున్న గొర్రెల మందను తప్పించబోయి అదుపు తప్పి కట్టెలలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. బేతంచెర్ల నుంచి కట్టెల లోడుతో బనగానపల్లెకు వెళ్తున్న ట్రాక్టర్‌కు ఎదురుగా వస్తున్న గొర్రెలను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. కట్టెల ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న కూలీలు ప్రాణాలతో బయటపడ్డారు.

# విద్యార్థులకు అందని శుద్ధ జలం

- కొలిమిగుండ్ల జడ్పీహెచ్ఎస్‌లో నిరుపయోగంగా వాటర్ ప్లాంట్
- బోరు నీరు తాగలేక ఇబ్బంది
- ఇళ్ల నుంచి బాటిళ్లను తెచ్చుకుంటున్న వైనం

కొలిమిగుండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వాటర్ ప్యూరిఫైర్ యూనిట్లు సరఫరా చేసింది. వాటి నుంచి శుద్ధ జలం వస్తుందని, ఆ నీళ్లను విద్యార్థులకు అందించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. అయితే వాటి నిర్వహణ కొరవడి చాలా వరకు యూనిట్లు పని చేయడం లేదు. మండలకేంద్రమైన కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 400మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఉండగా అది పనిచేయడం లేదు. దీనికి సంబంధించిన బోరు ఎండిపోవడంతో వాటర్ ప్లాంట్ మూతబడింది. దీంతో విద్యార్థులకు ఫ్లోరైడ్ వాటరు తాగాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే గ్రామానికి సంబంధించిన తాగునీటి పైపులైన్ నుంచి పాఠశాలకు నీటి సరఫరా ఉన్నా మినరల్ వాటర్ ప్లాంట్‌కు కనెక్షన్ ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనని విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలవుతున్నందున విద్యార్థులు తాగునీరు బాటిళ్లతో ఇంటి నుంచి తెచ్చుకుంటు న్నారు. కనీసం రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల వరకు నీరు తాగాలని వైద్యులు చెబుతున్నారని, ఇలా ఇంటి నుంచి తీసుకెళ్లిన ఒక బాటిల్ నీటితో సరిపెట్టుకొని వస్తున్నారని, ఇలా అయితే రోగాల బారినపడే ప్రమాదం ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకరావాలని కోరుతున్నారు.



బాటిళ్లతో నీటిని తెచ్చుకున్న విద్యార్థినులు



మూతపడిన ఆర్వో ప్లాంట్

## న్యాయం జరిగేలా చూస్తాం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

రుద్రవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దళారిని నమ్మి మోసపోయిన రైతులకు న్యాయం చేస్తానని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం రుద్రవరంలో మొక్కజొన్న రైతులు ఎమ్మెల్యేను కలిసి దళారి మోసాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న రైతుల సమస్యను సీఎం చంద్రబాబుతో మాట్లాడి న్యాయం చేస్తామని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ దాక్కున్నా మొక్కజొన్నల వ్యాపారిని పోలీసులు పట్టుకుంటారన్నారు. రైతులతో మొక్కజొన్నలు కొనుగోలు చేసి ఇలా మోసం చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయించి వ్యాపారిని పట్టుకొచ్చి డబ్బులు ఇప్పిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రంగనాయకులు, మాజీ సర్పంచ్ ఎర్రం ప్రతాప్‌రెడ్డి, పోలా గురుమూర్తి, నంద్యాలపార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, ముకుందాపురం సంజీవరాయుడు, సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### వివరాలు తెలిపిన సీఐ వంశీధర్

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు శిరివెళ్ల సీఐ వంశీధర్ రైతుల సమస్యను వివరించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మొక్కజొన్న వ్యాపారికి రెండు అకౌంట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. రెండు అకౌంట్లను బ్లాక్ చేయాలని బ్యాంకు అధికారులకు సూచించినట్లు ఆయన వివరించారు. ఈ రెండు అకౌంట్లలో రూ. 30 నుంచి రూ. 40 లక్షలు అమౌంట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వ్యాపారి కోసం గాలింపు చేపడతామన్నారు.

### అన్నదానం మహాదానం

కార్తీక మాసంలో అన్నదానం చేయడం మహాదానమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం రుద్రవరం బాస్కర నందీశ్వరాలయంలో నిర్వహించిన వన భోజనంలో ఆమె పాల్గొన్నారు. బాస్కరనందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వారణాసి గోపీశర్మ, శివశర్మ ఉన్నారు.

## తూకాల్లో మోసగిస్తున్నారు



నిరసన తెలుపుతున్న పూల రైతులు

డోన్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొందరు కమీషన్ వ్యాపారస్తులు పూలరైతులను తూకాల్లో మోసాలు చేసి నష్టపరుస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం పూలరైతులు ఆందోళనకు దిగారు. డోన్ పూల మార్కెట్ వద్ద నుంచి గుంపుగా పట్టణ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కోర్టు రోడ్డులో ఉన్న కొలతల తూనికల శాఖ అధికారి కార్యాలయం వద్ద రోడ్డుపైనే బైఠాయించి నిరసనలు తెలిపారు. డోన్ పూలమార్కెట్‌లో తక్కెట్లతో తూకాలు వేస్తూ మోసం చేస్తున్నారని, వాటి స్థానంలో ఎలక్ట్రానిక్ కాటాను ఏర్పాటు చేసి మోసాలను అరికట్టాలని రైతులు వెంకటరమణారెడ్డి, రాజేశ్వరరెడ్డి, హనుమంతు, చిన్న నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, చిన్న సాలన్న తదితరులు డిమాండ్ చేశారు. పట్టణ పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డోన్ నియోజకవర్గంలోని డోన్ మండలం, దర్వపరం, గోసానిపల్లె, చింతలపేట, ఎర్రగుంట్ల, చిన్నమల్కాపురం, కనపకుంట, ప్యాపిలి మండలంలోని హుశేనాపురం జలదుర్గం, బేతంచెర్ల మండలంలోని యు.కొత్తపల్లె, రంగాపురం తదితర గ్రామాలకు చెందిన పూల రైతులు వంద మందికి పైగా పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే కోట్ల రాక

ప్యాపిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుసేనాపురం గ్రామానికి మంగళవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి రానున్నట్లు సోమవారం పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనడంతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పార్టీ వర్గాలు కోరారు.

## డీటీగా రాజేశ్‌కుమార్ బాధ్యతలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొవెలకుంట్ల తహసీల్దారు కార్యాలయంలో భూముల రీసర్వే డీటీగా రాజేశ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే ఇమామ్ ఉయ్యాలవాడకు బదిలీ కావడంతో బండి ఆత్మకూరు మండలంలో పనిచేసే రాజేశ్‌కుమార్‌ను డిప్యూటేషన్‌పై కొవెలకుంట్లకు బదిలీ చేశారన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు

బేతంచెర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూత్ నెంబర్లు 274, 175లో బూత్ ఇన్‌చార్జ్‌లు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి పీడతల రూబెన్, కౌన్సిలర్ రామగోపాల్‌లు టీడీపీ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి టీడీపీ కార్యకర్త సభ్యత్వం చేసుకోవడం వలన రూ.5 లక్షల ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. టీడీపీ ప్రతి కార్యకర్తకు భరోసాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డె రామాంజనేయులు, శ్రీపతి నాగరాజు, కాశాల అంజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

రుద్రవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో శివనామస్మరణతో శివాలయాలు మారుమోగా యి. సోమవారం కడ సోమవారం కావడంతో శివాలయాల్లో అన్నదానాలు నిర్వహించారు. అభిషేకాలు నిర్వహించారు. శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పెదకం బలూరు, రుద్రవరం, ఆల మూరు, చిన్నకంబలూరు, కోటకొండ శ్రీరంగాపురం గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

## బాధిత కుటుంబానికి పరామర్శ



వివరాలు తెలుసుకుంటున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఆర్‌సీ నాగిరెడ్డి కుటుంబాన్ని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సోమవారం పరామర్శించారు. నాగిరెడ్డి కుమారుడు లోకేశ్వరరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న ఆయన మీరాపురం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీసీ కుటుంబం అప్పుడూ, టీడీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని బీసీ రాజారెడ్డి భరోసా కల్పించారు.

## పంట నమోదు తప్పనిసరి: ఏవో

కొలిమిగుండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి సూచించారు. సోమవారం పంట నమోదు కార్యక్రమంపై ఆమె సమీక్షించారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి, పంట నమోదుతో పాటు పంటల భీమా చేసుకోవాలని ఏవో జ్యోతి తెలిపారు.

## తోడెండ్లపల్లెలో పంట కోత ప్రయోగం

చాగలమర్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడెండ్లపల్లెలో సోమవారం ఏవో రంగనేతాజీ పర్యవేక్షణలో ఏఈవోలు మండలం, ఏపీఎస్ మొక్కజొన్న, మినుము పంటలపై పంట కోత ప్రయోగం చేశారు. కార్యక్రమంలో వీపీఏ నవీన్‌కుమార్‌రెడ్డి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

## ఉరుసు పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్ దర్గా ఉరుసు పోస్టర్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు మాట్లాడుతూ ఈనెల 23 నుంచి నిర్వహించనున్న ఉరుసుకు రావాల్సిందిగా ఆహ్వానించారు. కాగా, ఉరుసుకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ. లక్ష విరాళాన్ని కమిటీ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు బురానుద్దీన్, జాఫర్, ఫరూక్, అఫ్జల్‌హుస్సేన్, చిన్నబాషా తదితరులున్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి





శిరివెళ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

శిరివెళ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా శిరివెళ్లలోని పీహెచ్‌సీ నుంచి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని అన్నారు. హెచ్‌ఐవీ చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని వారు తెలిపారు. ప్రజల్లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

కొలిమిగుండ్ల : ఎయిడ్స్ మహమ్మారిపై లారీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రామ్‌కో పరిశ్రమ వైద్యుడు శశిధర్ అన్నారు. సోమవారం రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు ఆదేశాలమేరకు పరిశ్రమ ఆవరణంలో ఎయిడ్స్ వ్యాధి పట్ల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పార్మాసిస్టు నరేంద్ర, వైద్య సిబ్బంది ప్రతాప్, రామ్‌కో భరత్‌రెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

## రూ.2.57 కోట్లతో గ్రామాభివృద్ధి పనులు

చాగలమర్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.2.57 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పీఆర్ ఏఈ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో రూ.23 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను టీడీపీ గ్రామ కన్వీనర్ నరేంద్రరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, నర్సిరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి'

రుద్రవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఏ ఒక్క గ్రామంలో కూడా నాణ్యంలో ప్రభుత్వ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల దళారులు, వ్యాపారులు కుమ్మక్కయ్యారు. రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆయన అన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### వరి కోతలకు జాగ్రత్తలు తీసుకోవాలి

- వ్యవసాయశాఖ అధికారి రంగనేతాజీ



చాగలమర్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరి పంట కోతదశకు చేరింది. తుఫాన్ కారణంగా వర్షాలు పడితే రైతులు ముందస్తు జాగ్రత్తలతో వరి కోతలకు శ్రీకారం చుట్టాలని ఏవో రంగ నేతాజీ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

**ప్రశ్న:** వరి కోతలపై రైతులకు అవగాహన కల్పించారా?

**జవాబు:** వరి పండించే రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా గ్రామాలలో అవగాహన కల్పించాం.

**ప్రశ్న:** ఎన్నిరోజుల్లో వరి కోతలు ప్రారంభమవుతాయి?

**జవాబు:** వెద పద్ధతి ద్వారా ముందుగా వేసిన వరి పంట కోతదశకు వచ్చింది. రెండు మూడు రోజుల్లో రైతులు వరి కోతలు కోయడానికి సిద్ధమవుతున్నారు.

**ప్రశ్న:** వర్షంపై ముందస్తుగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**జవాబు:** వర్షం పడి వరిపైరు కనుక పడిపోతే ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలి.

**ప్రశ్న:** వరి కోతలు సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**జవాబు:** పూర్తిగా భూమి ఎండిన తరువాత రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు కోయించాలి. భూమి తేమగా ఉన్నప్పుడు వరి కోతలు కోయడం వలన రైతులు నష్టపోవాల్సి వస్తుంది. వరి పంట నేలకు అనుకుంటే యంత్రాల ద్వారా కాకుండా కూలీలచే వరి కోతలు కోయించాలి.

**ప్రశ్న:** ధాన్యం నిల్వలకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**జవాబు:** ధాన్యాన్ని నిల్వ పెట్టుకునే రైతులు యంత్రాల ద్వారా నూర్పిడి చేసి, తేమలేని ప్రదేశంలో ఆరబోసి పొడిగా అయిన తరువాత నిల్వ చేసుకోవాలి.

**ప్రశ్న:** రబీకి సాగునీరు అందిస్తారా?

**జవాబు:** ఈ సంవత్సరం రబీకి కూడా ప్రభుత్వం సాగునీరు అందిస్తుంది. మొక్కజొన్న, జొన్న పంటలు వేయడానికి రైతులు మొగ్గుచూపుతున్నారు.

## ముచ్చట్ల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న సీఐలు

బేతంచెర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ శివారులో వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామిని, భ్రమరాంబ అమ్మవార్లను సోమవారం బేతంచెర్ల సీఐలు వెంకటేశ్వరరావు, ఆళ్లగడ్డ సీఐ యుగంధర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు సీఐలకు ఆలయ అర్చకుడు చంద్రమోహన్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సీఐల వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## క్రీడల్లో రాణించాలి

బేతంచెర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సుమేధ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని సుమేధ ఉన్నత పాఠశాలలో కరాటేలో గ్రేడింగ్ బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరాటే మాస్టర్ వెంకటేష్ కోచ్ కరాటేలో విద్యార్థులకు శిక్షణలో మెలకువలు ఇస్తూ తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్ నాగన్న, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాల డెయిరీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

చాగలమర్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి, ముత్యాలపాడు, చక్రవర్తులపల్లె, నల్లగొండ్ల గ్రామాలలో పాల డెయిరీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మేనేజర్ ఈశ్వరయ్య సోమవారం తెలిపారు. ఆయా పాలడెయిరీ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా షైదుకూరుకు చెందిన చంద్రానాయక్‌ను నియమించారన్నారు. చిన్నవంగలిలో పాల డెయిరీ ఎన్నికలకు 4న నామినేషన్లు స్వీకరిస్తారని అన్నారు. ఏ న్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

## హుండీ ఆదాయం లెక్కింపు

శిరివెళ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల-గిద్దలూరు రహదారిలో వెలసిన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను అధికారులు సోమవారం లెక్కించారు. రెండు నెలల వ్యవధికి గాను రూ.1,29,937 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బీవీ నరసయ్య తెలిపారు. దేవాదాయశాఖ బనగానపల్లె డివిజన్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఆలయం వద్ద తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ తదితర వాటిని విక్రయించుకునేందుకు, తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు నిర్వహించాల్సిన బహిరంగ వేలాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు.

## 'స్థలం కేటాయించండి'

డోన్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వపరం గ్రామంలోని ఎస్సీ కాలనీ అవసరాల కోసం స్థలాన్ని కేటాయించాలని టీడీపీ గ్రామ నాయకుడు ఈశ్వరయ్య కోరారు. సోమవారం డోన్ తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి కేటాయించిన ఇళ్ల స్థలాలకు ఉన్న భూమి పోను, మిగిలి ఉన్న 50 సెంట్ల భూమిలో కల్యాణ మండపం, నీళ్ల ట్యాంకు నిర్మాణానికి అధికారులు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బాలరంగడు, శేఖర్, వెంకట్రాముడు, రంగన్న, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డోన్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమ సుందర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని నెహ్రూనగర్‌లో డేటా ప్రో ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న టైలర్, బార్బర్ వారికి శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. హేమసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి 18 రకాల చేతివృత్తుల వారికి ఆర్థిక చేయూత అందించడానికి విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టారని, బ్యాంకు ద్వారా ఎటువంటి షూరిటీ లేకుండా రుణాలు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డేటా ప్రో ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి త్రోబాల్ ఎంపిక పోటీలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో చైతన్య పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో 34వ జాతీయస్థాయి జూనియర్ త్రోబాల్ ఎంపిక టోర్నమెంట్ మంగళవారం నిర్వహిస్తున్నట్లు త్రోబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రవంతి సోమవారం తెలిపారు. ఎంపికలో పాల్గొనేందుకు వచ్చే బాల బాలికలు పదో తరగతి, లేదా ఇంటర్ సర్టిఫికెట్‌తో పాటు రూ.50 రుసుము చెల్లించాలని ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణ వెల్లడించారు. ఎంపికైన బాలుర, బాలికల జట్టు ఆంధ్రప్రదేశ్ తరఫున ఈ నెల 9 నుంచి 11 వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే 34వ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాయని వారు తెలిపారు.

## 8న సాగు నీటి సంఘం ఎన్నికలు

కొవెలకుంట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న సాగునీటి సంఘం ఎన్నికలు జరుగుతాయని, అందుకు జాబితా సిద్ధం చేసినట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఆరు గ్రామాల్లో రేవనూరు, కలుగొట్ల సౌదరదిన్నె, గుళ్లదూర్తి, బిజనవేముల, జోళదరాశి గ్రామాల్లో సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాలకు ఎన్నికల అధికారిని నియమించామన్నారు.